## క్లుప్తంగా

### వైభవంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణోత్సవం జరిపిస్తున్న అర్చకులు

**మడకశిరరూరల్:** మండల పరిధిలోని చందకచర్లలో వెలసిన ఆంజనేయస్వామి ఉత్సవాలు శుక్రవారం పూజ కార్యక్రమాలతో ప్రారంభమయ్యాయి. గంగపూజ, హోమం, పంచామృతాభిషేకం, అంకురార్పణ, సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలకంరించి వివిధ పూజలు చేశారు. శనివారం హనుమాన్ జయంతి సందర్భంగా స్వామివారికి జ్యోతులు, మధ్యాహ్నం బ్రహ్మరథోత్సవం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

### మడకశిరకు చేరిన నోట్ పుస్తకాలు

**మడకశిర:** రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా అందించే నోట్ పుస్తకాలను మండల కేంద్రాలకు సరఫరా చేసే ప్రక్రియను ప్రారంభించింది. ఇందులో భాగంగానే విద్యార్థులకు అవసరమైన నోట్ పుస్తకాలు శుక్రవారం మడకశిరకు చేరాయి. వాటిని స్థానిక ఎంఈఓ భాస్కర్ ఎమ్మార్సీలో భద్ర పరిచారు. ఇంతకు ముందే విద్యార్థులకు అందించే ఉచిత పాఠ్య పుస్తకాలను ప్రభుత్వం సరఫరా చేసిన విషయం తెలిసిందే.

### ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి



కలశాన్ని ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకెళ్తున్న దృశ్యం

**మడకశిర రూరల్:** మండల పరిధిలోని నీలకంఠాపురంలోని నీలకంఠేశ్వరస్వామి సముదాయ దేవాలయాలను శుక్రవారం సాయంత్రం నైమిషారణ్య పీఠాధిపతి, హిందూ ధార్మిక సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బాల బ్రహ్మానంద సరస్వతి సందర్శించారు. ఆలయంలో శివకేశవ లీలా విలాసం ప్రవచనం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకున్నప్పుడే మంచి జరగడంతో పాటు వరుణ దేవుడు కరుణిస్తారన్నారు. మాజీ మంత్రి రఘువీరారెడ్డి కుటుంబ సభ్యులు, భక్తులు బాల బ్రహ్మానంద సరస్వతి ఆశీర్వాదం పొందారు.

### మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి



మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంఈఓలు

**హిందూపురం టౌన్:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం మంచి పోషక విలువలతో కూడిన మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఈఓలు గంగప్ప, ప్రసన్న లక్ష్మీ మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు, హెల్పర్లకు సూచించారు. శుక్రవారం పట్టణంలోని అజీజీయా ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన కుక్ కం హెల్పర్లకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భోజనం బాగా చేసిన ముగ్గురికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ కార్యాలయ సిబ్బంది తౌసిఫ్ ఖాన్, ప్రవీణ్ కుమార్, సురేష్ బాబు, రాజశేఖర్ పాల్గొన్నారు.

**రొళ్ల:** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనాన్ని ఎండీఎం నిర్వాహకులు వడ్డించాలని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎండీఎం నిర్వాహకులు, హెల్పర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ రకాల పౌష్టికాహారాలను తయారు చేసే విధానాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. వంట గదులను, పాత్రలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మెనూ సక్రమంగా పాటిస్తూ నాణ్యమైన భోజనాన్ని వడ్డించిన నిర్వాహకులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తామన్నారు.

### కౌంటింగ్ సందర్భంగా శోభాయాత్ర రద్దు

**హిందూపురం:** ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అధికారులను సూచనలమేరకు హనుమద్ జయంతి సందర్భంగా తలపెట్టిన శోభయాత్రను ఈఏడాది రద్దు చేసినట్లు హిందూ సుర్క్షా సేవా సమితి తెలియజేసింది. శనివారం హనుమద్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు, భజనలు చేపడుతున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

# పురంలో బాలకృష్ణకు షాక్ తప్పదా?

- నియోజకవర్గంలోని పల్లెల్లో 90 శాతం వరకూ పోలింగ్
- పెద్ద ఎత్తున ఓటింగ్‌లో పాల్గొన్న మహిళలు
- సంక్షేమాభివృద్ధికే జనం జైకొట్టారంటున్న రాజకీయ విశ్లేషకులు

**హిందూపురం:** నియోజకవర్గం టీడీపీకి పట్టున్న ప్రాంతమని చెబుతున్న టీడీపీకి ఈసారి ఎన్నికల్లో ఎదురుదెబ్బ తప్పేలా లేదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన ప్రజా సంక్షేమ పథకాలు, ముఖ్యంగా మహిళా అభ్యున్నతి కోసం చేసి కృషి ప్రజల్లో మార్పుకు కారణమైందని అంటున్నారు. మహిళలకు పెద్ద పీత వేస్తూ నియోజకవర్గంలో బీసీ మహిళా అభ్యర్థి అయిన దీపికను బరిలోకి దింపడం కూడా కలిసొచ్చిందని చెబుతున్నారు. అందుకే రాష్ట్రంలోనే హాట్ సీట్‌గా పేరున్న 'పురం'లో ప్రస్తుత ఎమ్మెల్యే బాలకృష్ణకు షాక్ తప్పదంటున్నారు.



వైఎస్సార్‌సీపీ అభ్యర్థి టీఎన్ దీపిక



హిందూపురంలో ఓటేసేందుకు బారులు తీరిన మహిళలు (ఫైల్)

**పీఏల పాలనపై విసుగు**

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జరిగిన ఓటింగ్‌లో పట్టణ ప్రాంతంలో పోలింగ్ అంతంత మాత్రమైనా గ్రామీణ ఓటర్లు మాత్రం ఓటు వేయడానికి పోటెత్తారు. సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే చేర్చి అందరి మన్ననలనూ పొందిన జననేత జగన్‌ను మళ్లీ సీఎం పీఠంపై కూర్చోబెట్టేందుకు పోలింగ్ కేంద్రాల ఎదుట బారులు తీరి మరి తమ అభిమానాన్ని చాటుకున్నారని స్థానిక రాజకీయాలు నేతలు చెప్పుకుంటున్నారు. ముఖ్యంగా టీడీపీ అభ్యర్థి బాలకృష్ణ రెండుసార్లు గెలిచినా స్థానికంగా లేకపోవడం, నియోజకవర్గ పాలనను పీఏలకు కట్టబెట్టి సినిమా షూటింగ్‌లకు పరిమితం కావడంతో ప్రజలు తమ కష్టాలను ఎవరికి చెప్పుకోవాలో తెలీని పరిస్థితి నెలకొంది. ఇవాన్నీ చూసి విసిగిపోయిన పురం ప్రజలు వైఎస్సార్‌సీపీ మహిళా అభ్యర్థి దీపిక వైపు మొగ్గు చూపడానికి కారణమైందంటున్నారు.

**ఓటేసింది 1.93 లక్షల మంది**

ఈ సారి జరిగిన ఓటింగ్‌ను పరిశీలిస్తే ముఖ్యంగా రూరల్ ఓటింగ్ 90 శాతం వరకూ నమోదైంది. నియోజకవర్గంలో ఏ గ్రామంలో చూసినా పోలింగ్ తీరుపై చర్చలు నడుస్తున్నాయి. పెరిగిన గ్రామీణ ఓటింగ్ చూసి ప్రతి పక్షపార్టీకి అనుకూలమని కొందరంటుంటే .. ప్రభుత్వ పాలన పట్ల ఆకర్షితులై ప్రజలలో ముఖ్యంగా మహిళల్లో వచ్చినా మార్పుకు నిదర్శమని మెజార్టీ ప్రజలు అభిప్రాయపడుతున్నారు. భిన్నాభిప్రాయాలు టీడీపీలో నిరుత్సాహాన్ని నింపగా వైఎస్సార్‌సీపీలో జోష్‌ను పెంచింది. హిందూపురం నియోజకవర్గంలో మొత్తం 2,49,174 ఓటర్లు ఉండగా 1,93,905 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 97,653 మంది కాగా మహిళలు 96 242 మంది ఓటేశారు. ఇతరులు ఆరుగురు ఉన్నారు.

**90 శాతం మందికి సంక్షేమ లబ్ధి**

హిందూపురం నియోజకవర్గంలో 90 శాతానికిపైగా గ్రామీణ కుటుంబాలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతో లబ్ధి పొందాయి. ఇంతవరకూ ఏ ప్రభుత్వంలో పొందనంతగా ఈ ఐదేళ్ల కాలంలో డీబీటీ , నాన్ డీబీటీ ద్వారా గ్రామీణ కుటుంబాలకు ప్రయోజనాలు కల్గింది. గ్రామాల్లో సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలు చేరాయి. ప్రతి గ్రామంలో రూ.కోట్ల నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్ భవనాలు నిర్మించారు. నాడు–నేడుతో ప్రభుత్వ స్కూళ్ల రూపురేఖలు మారిపోయాయి. వీటన్నింటిని చూశాక గత టీడీపీ పాలన కన్నా, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని పాలనా బాగుందన్న నిర్ణయానికి వచ్చారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అందుకే రాత్రి 10 గంటల వరకూ క్యూలైన్లలో వేచివుండి మరీ ఓట్లు వేశారంటున్నారు. నియోజకవర్గ పరిధిలో 253 పోలింగ్ కేంద్రాలు ఉండగా దాదాపు 70 శాతం కేంద్రాల్లో 90 శాతం పోలింగ్ నమోదైందని గుర్తు చేస్తున్నారు.

**మున్సిపాలిటీపైనే ఆశలు**

మున్సిపాల్టీ వార్డుల్లో తమకు అనుకులంగా ఓటింగ్ జరిగిందని టీడీపీ నాయకులు అంచనాలు వేసుకుంటున్నారు. అయితే నియోజకవర్గంలోని చిలమత్తూరు, హిందూపురం రూరల్, లేపాక్షి మండలాల్లో ఓటింగ్ శాతం పెరగడంతో నియోజకవర్గ వ్యాప్తంగా ఓటింగ్ అంచన వేస్తే వైఎస్సార్‌సీపీకే అనుకులంగా ఉందని అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. మున్సిపాల్టీలో టీడీపీకి అనుకూలంగా ఓట్లు వచ్చినా ఆ మూడు మండలాల్లో మెజార్టీ ఓటర్లు వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఓట్లేశారంటున్నారు. అందువల్లే ఈసారి ఎన్నికల ఫలితాలు వైఎస్సార్‌సీపీకి అనుకులంగా ఉంటాయని చెబుతున్నారు.



టీడీపీ అభ్యర్థి బాలకృష్ణ

### పొగాకు వినియోగం ప్రాణాంతకం



హిందూపురం: పొగాకు వ్యతిరేక ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

**హిందూపురం టౌన్:** పొగాకు వాడడం ద్వారా మరణానికి దగ్గరైనట్లేనని హిందూపురం జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లింగన్న అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దంత వైద్యుడు డాక్టర్ భూపాలం విజయ్‌బాబు , మానసిక వైద్యనిపుణులు డాక్టర్ రాజగోపాల్, డెంటిస్ట్ డాక్టర్ అయిషా, సైక్రియాటిక్ కౌన్సిలర్ రాణి, సీవోలు ముస్తఫా, రమేష్, లోకేష్, రవి, తనూజా, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

**పరిగి:** పొగాకు ఉత్పత్తుల వినియోగం ప్రాణాంతకమని డాక్టర్ యాస్మీన్ తెలిపారు. ప్రపంచ పొగాకు వినియోగ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ఇండియన్ డిజైన్స్ ఎక్స్‌పోర్టు గార్మెంట్ పరిశ్రమ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ముందుగా ర్యాలీని నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏజీఎం మహేష్, హెచ్‌ఆర్‌ఎం గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. పొగాకు ఉత్పత్తుల వాడకం హానికరమని మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ నవీన, డాక్టర్‌ స్వరూపరెడ్డి తెలిపారు. మండలంలోని ప్రీకాట్ స్పిన్నింగ్ మిల్లు కొడిగెనహళ్లిలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు.

**సోమందేపల్లి:** పొగాకు వాడకం వల్ల ఆరోగ్యానికి హానికరం అని వైద్యులు హరికుమార్, ఓంకార్ తెలిపారు. సోమందేపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రోగులతో ప్రతిజ్ఞ చేయించారు. సీహెచ్ఓ మనోహరరెడ్డి, పీహెచ్ఎన్ సుబ్బమ్మ, సూపర్‌వైజర్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ అభ్యర్థి శాంతమ్మను కలిసిన ఈరలక్కప్ప



శాంతమ్మను కలిసిన ఈరలక్కప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు

**మడకశిర:** హిందూపురం పట్టణంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి శాంతమ్మను మడకశిర అసెంబ్లీ అభ్యర్థి ఈరలక్కప్ప కలిశారు. ఈ సందర్భంగా వారు పోలింగ్ సరళి, కౌంటింగ్ ఏర్పాట్ల ప్రక్రియపై చర్చించారు. మంగళవారం జరిగే కౌంటింగ్ ప్రక్రియలో అనుసరించాల్సిన అంశాలను చర్చించినట్లు ఈరలక్కప్ప తెలిపారు. మడకశిర నియోజకవర్గానికి చెందిన కౌంటింగ్ ఏజెంట్లు జాగ్రత్తగా వ్యవహరించే విధంగా చూడాలని ఆమె కోరినట్లు తెలిపారు.

**స్ట్రాంగ్ రూమ్ పరిశీలన**

హిందూపురం సమీపంలోని బిట్ కళాశాలను శుక్రవారం మడకశిర అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఈరలక్కప్ప సందర్శించారు. కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌లో మడకశిర అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలను భద్రపరచిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన కళాశాలను సందర్శించి స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లపై ఆరా తీశారు.

## కవ్వింపు చర్యలకు దిగితే తాట తీస్తాం



మాట్లాడుతున్న డీఎస్పీ కంజాక్షన్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ బాజీజాన్‌సైదా

**లేపాక్షి:** ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎవరైనా కవ్వింపు చర్యలకు దిగితే తాటతీస్తాం. ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ నిర్వహించేందుకు అందరూ సహకరించాలని హిందూపురం డీఎస్పీ కంజాక్షన్ తెలిపారు. శుక్రవారం రాత్రి లేపాక్షి పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని రౌడీషీటర్లుకు, ట్రబుల్ మాంగర్స్‌కు కౌన్సెలింగ్ ఇచ్చారు. సమస్యాత్మకమైన కల్లూరు, కొండూరు, మైదుగోళం, కంచిసముద్రం, చోళసముద్రం గ్రామాలపై ప్రత్యేక సాయుధ బలగాలు మోహరిస్తున్నట్లు చెప్పారు.

**గొడవలకు దిగితే కఠిన చర్యలు**

**మడకశిర:** శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పెనుకొండ డీఎస్పీ బాజిజాన్‌సైదా రౌడీషీటర్లను హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని సర్కిల్ కార్యాలయలో నియోజకవర్గంలోని రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. మంగళవారం జరిగే ఓట్ల లెక్కింపు సందర్భంగా గొడవలకు దిగినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సీఐలు రాజ్‌కుమార్, మనోహర్, ఎస్ఐలు పాల్గొన్నారు.

## అంకిత భావంతో పని చేస్తేనే గుర్తింపు



హిందూపురం: డీఈ వెంకటరమణను సన్మానిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి



పెనుకొండ: సీహెచ్ఓ భారతమ్మను సన్మానిస్తున్న వైద్య సిబ్బంది



రొళ్ల: వైకేపీ సీసీ లక్ష్మీనారాయణ దంపతులను సన్మానిస్తున్న డీఆర్‌డీఏ పీడీ నరసయ్య

**రొళ్ల:** విధి నిర్వహణలో ప్రతి ప్రభుత్వ ఉద్యోగి అంకిత భావంతో పని చేస్తేనే సమాజంలో ఉత్తమ గౌరవం, గుర్తింపు లభిస్తాయని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయం ఆవరణలో వైకేపీ సీసీగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన లక్ష్మీనారాయణ, రామలక్ష్మమ్మ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ వైఎస్సార్ క్రాంతి పథకంలో మహిళా సంఘాల అభివృద్ధికి లక్ష్మీనారాయణ ఎంతో కృషి చేశారన్నారు. ఆయన చేసిన సేవలను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. డీపీఎంలు రామిరెడ్డి, రమణప్ప, రామ్‌మోహన్, శ్రీనిధి ఏజీఎం వేణుగోపాల్, మేనేజర్ నరేష్, ఇన్‌చార్జ్ ఏసీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

**హిందూపురం:** హిందూపురం మున్సిపల్ డీఈ వెంకటరమణ పదవీ విరమణ చేశారు. శుక్రవారం స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ వెంకటరమణ విధులు సమర్థవంతంగా నిర్వహించారని కొనియాడారు. అందరినీ కలుపుకుపోతూ పనిచేసేవారన్నారు. ఎంఈ విశ్వనాథ్, డీఈ వాణీ, బాలసుబ్రమణ్యం, టీఓ ఆనంద్‌రాజ్, ఏఈలు జనార్దన్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

**గుడిబండ:** 36 ఏళ్లుగా రెవిన్యూశాఖలో వివిధ హోదాల్లో విధులు నిర్వహించి గుడిబండ డిప్యూటీ తహశీల్దారుగా పదవీ విరమణ చేసిన జి మహబూబ్‌పీరాన్‌ను శుక్రవారం సిబ్బంది ఘనంగా సన్మానించారు. మండల తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో పలువురు వక్తలు ఆయన సేవలను కొనియాడారు. తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి , సబ్‌కలెక్టర్ అపూర్వభరత్, రెవిన్యూ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మోహన్‌దాస్, ఆర్ఓ గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

**సోమందేపల్లి:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఖాదర్‌వలి శుక్రవారం పదవీ విరమణ చేశారు. అలాగే ఐసీడీఎస్‌శాఖ సూపర్ వైజర్ సుశీల, సౌభాగ్యవతి కూడా పదవి విరమణ చేశారు. విధి నిర్వహణలో వారు అందించిన సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, డీవైఈఓ రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

**పెనుకొండ:** మండల పరిషత్ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం సేవలు మరువలేనివని ఎంపీపీ గీత కొనియాడారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యం శుక్రవారం పదవీ విరమణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు సిబ్బంది, నాయకులు ఘనంగా సన్మానించారు. ఎంపీడీఓ విశ్వమోహన్ తదితరులు పాల్గొన్నారు.

**పెనుకొండ:** ప్రభుత్వ వైద్యశాలలో సీహెచ్‌ఓగా విధులు నిర్వహిస్తున్న భారతమ్మ శుక్రవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా సహచర ఉద్యోగులు ఆమెను ఘనంగా సన్మానించి ఆమె సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర, డాక్టర్ నాగరాజు నాయక్, వైద్య సిబ్బంది, ఎంపీటీసీ సభ్యురాలు నిర్మల, నాయకులు దుర్గప్ప, మల్లిరెడ్డి, నారాయణ స్వామి, పిట్టాబాబు, పాదయాత్ర నటేష్ తదితరులు పాల్గొన్నారు.

**రొద్దం:** మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సీఎస్‌డీటీగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన పోతన్నను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఉదయం రేషన్ డీలర్ల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో సన్మాన సభ ఏర్పాటు చేసిన సీఎస్‌డీటీ దంపతులను సత్కరించారు.

**పావగడ:** తాలూకాలోని కోటగుడ్డ పీహెచ్‌సీలో సీనియర్ నర్సుగా పనిచేస్తున్న సరస్వతమ్మ శుక్రవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా తోటి ఉద్యోగులు ఆమెను ఘనంగా సత్కరించారు. తాలూకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కిరణ్ , కోటగుడ్డ పీహెచ్‌సీ వైద్యుడు లింగరాజు, ఆరోగ్యశాఖ సిబ్బంది చంద్రశేఖర్, ప్రభామణి, శ్యామన్న, రాజు, శ్రీనాథ్, ఉపాధ్యాయుడు ఐఏ నారాయణప్ప, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

### సేవాభావాన్ని పెంచుకోవాలి

**పావగడ:** విద్యార్థులు సేవాభావాన్ని పెంచుకుని సామాజిక సేవల్లో పాలు పంచుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా ఎన్ శ్రీధర్... రేంజర్స్, రోవర్స్ యూనిట్ విద్యార్థులకు తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణంలో స్కౌట్స్, గైడ్స్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వేసవి శిబిరాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడారు. మీరు ధరించిన యూనిఫాం నుంచి మీకు గౌరవం రావడం కంటే మీ నుంచి యూనిఫాంకు గౌరవం దక్కేలా సేవలందించాలన్నారు. స్కౌట్స్, గైడ్స్ విభాగం ఏఎస్‌ఓసీ కరిసిద్ధప్ప తదితరులు పాల్గొన్నారు.

### పశువుల సంత తనిఖీ

**గుడిబండ:** మండల కేంద్రంలో నిర్వహించే వారపు పశువుల సంతను శుక్రవారం డీఎల్‌పీఓ శివనారాయణరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో ప్రతి శుక్రవారం పశువుల సంతను సక్రమంగా నిర్వహించాలని, ప్రభుత్వ ఆదాయాన్ని పెంచాలని పంచాయితీ అధికారులకు సూచించారు. పశువుల సుంకం రశీదులను పరిశీలించారు. ప్రభుత్వ ఆదాయాన్ని గండి కొడితే తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్‌డీ నాగరాజునాయక్, పంచాయతీ కార్యదర్శి ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**పౌరహక్కులపై అవగాహన**

**సోమందేపల్లి:** మండలంలోని గుడిపల్లి గ్రామంలో శుక్రవారం పౌరహక్కుల చట్టాలపై తహసీల్దార్ అంజనా దేవి అవగాహన కల్పించారు. అక్షరాస్యతతోనే అన్ని రంగాల్లో రాణించడానికి సాధ్యం అవుతుందని చెప్పారు. ఎస్ఐ విజయ్‌కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

**అమరాపురం:** మండలంలోని హలుకూరు డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కాలనీలోని ప్రజలకు పౌర హక్కులపై శుక్రవారం సాయంత్రం ఎస్ఐ జనార్ధననాయుడు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవాలన్నారు. ఏఎస్ఐ రామంజనేయులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

**వెంకటగిరిపాళ్యంలో కార్డెన్ సెర్చ్**

**పెనుకొండ రూరల్:** మండలంలోని వెంకటగిరిపాళ్యంలో శుక్రవారం సర్కిల్ పరిధిలోని పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని అనుమానితుల ఇళ్లలో సోదాలు చేశారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనాల రికార్డులను పరిశీలించారు. అనంతరం సీఐ యుగంధర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎన్నిక నియమాలను పాటించాలన్నారు. కియా ఎస్ఐ రంగడు, సర్కిల్ పరిధిలోని సిబ్బంది పాల్గొన్నారు.

**లక్ష్మీనిడిమామిడమ్మకు ప్రత్యేక పూజలు**



**మడకశిరరూరల్:** మండల పరిధిలోని జమ్మానిపల్లిలో వెలసిన లక్ష్మీనిడిమామిడమ్మకు శుక్రవారం ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఈ ఏడాది విస్తారంగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ భక్తులు, గ్రామ ప్రజలు పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

**ఆలయంలో ఎమ్మెల్యే పూజలు**

**మడకశిర:** పట్టణంలోని మిట్టబండ ఆంజనేయస్వామి ఆలయాన్ని శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామి సందర్శించారు. హనుమత్ జయంతిని పురస్కరించుకుని ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. అర్చకులు ఆయనకు తీర్థ ప్రసాదాలను అందించారు.

**ఇసుక ట్రాక్టర్ సీజ్**

**సోమందేపల్లి:** మండల కేంద్రమైన సోమందేపల్లిలోని చాకర్లపల్లి రైల్వేగేటు సమీపంలో ఇసుక ట్రాక్టర్‌ను సెబ్ పోలీసులు శుక్రవారం సీజ్ చేశారు. ట్రాక్టర్‌ను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

**పిల్లలను భవిత కేంద్రంలో చేర్పించండి**


**రొళ్ల:** ప్రత్యేక అవసరాలున్న దివ్యాంగుల పిల్లలను గుర్తించి భవిత కేంద్రంలో చేర్పించి విద్య నేర్పించడానికి సీఆర్పీలు, తల్లిదండ్రులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రత్యేక అవసరాల దివ్యాంగుల పిల్లలను గుర్తించే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో భవిత కేంద్రం ఉపాధ్యాయులు రమేష్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

## పోషకాల గని 'పనస'



మడకశిరలో విక్రయానికి ఉంచిన పనస పండ్లు

**మడకశిరరూరల్:** రూపంలో ఘనం...రుచిలో మహా ఘనం.. పోషకాల గని... నోరూరించే పనస పండు ఆరోగ్యానికి అన్ని విధాలా మేలు చేస్తుందని వైద్యులు చెబుతున్నారు. మడకశిర నియోజకవర్గంలో రైతులు తోటల్లో రెండు, మూడు చొప్పున పనస చెట్లు పెంచుకున్నారు. ఈ చెట్లు మొదలు నుంచి చివరి నిండా కాయలు నిండి ఉంటాయి. ఇతర ప్రాంతాల నుంచి పనస కాయలను తీసుకొచ్చి మడకశిర పట్టణంలో కాయ సైజును బట్టి రూ.200 నుంచి 300 వరకూ విక్రయిస్తున్నారు. మడకశిర మండల పరిధిలోని దాసరిబండ వద్ద రైతు హనుమంతేగౌడ్ పెంచుకున్న చెట్టులో కింద భాగంలోనే దాదాపు 28 వరకు కాయలు కాశాయి.



రైతు హనుమంతేగౌడ్ పొలంలో చెట్టు నిండా పనస గుత్తులు

**మార్చి నుంచి జూలై దాకా..**

పనస పండు పండును ఆంగ్లంలో జాక్ ఫ్రూట్ అంటారు. మార్చి నుంచి జూలై వరకూ పనస చెట్టుకు బరువైన కాయలు వేలాడుతూ కనిపిస్తాయి. సీజన్‌లో లభించే పనస పండును కచ్చితంగా తినాలని వైద్యులు చెబుతుంటారు. పనసలో పిండి పదార్థాలు, చక్కెరలు, పీచు పదార్థాలు, విటమిన్ ఏ, బీ1, బీ2, బీ3, బీ5, బీ6, బీ9, సీ, ఈతో పాటు పాస్ఫరస్, మెగ్నీషియం, మాంగనీస్, జింక్ వంటి ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి.

**జీర్ణ వ్యవస్థ మెరుగుకు...**

జీర్ణశక్తిని మెరురుపర్చగడంతో పనస ఎంతో సహాయ పడుతుందని వైద్యులు చెబుతున్నారు. అలాగే మలబద్ధకాన్ని నివారించే గుణం ఉందని, రక్తపోటును తగ్గించడం, వ్యాధి నిరోధక శక్తి పెంచడం, క్యాన్సర్ నివారిణిగా కూడా పనిచేస్తుందంటున్నారు. చర్మ వ్యాధులు, ఆస్తమా, జ్వరం, డయేరియా నివారణకు పనస వేర్లు ఉపయోగపడతాయని చెబుతున్నారు.